www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 4 ఫిబ్రవరి 2023

5

పశ్చిమ గోదావరి



బడ్జెట్‌లో రైతులకు, పేదలకు ఒరిగింది శూన్యం : బలరాం

భీమవరం:కేంద్ర బడ్జెట్ సామాన్య, పేద, మధ్యరగతి ప్రజలకు, రైతులకు నిరుపయోగమని సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం విమర్శించారు. బడ్జెట్‌ను నిరసిస్తూ సిపిఎం ఆద్వర్యంలో స్థానిక ప్రకాశంచౌక్ సెంటర్‌లో శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ సామాన్య ప్రజలపై భారాలు మోపేలా బడ్జెట్ ఉందన్నారు. బడ్జెట్ అంటే నిధులు పెరిగి, భారాలు, ధరలు తగ్గుతాయని దేశ ప్రజలు ఆశగా చూశారని కానీ వారి ఆశలు అడియాసలయ్యాయన్నారు. ఉపాది హామీ చట్టానికి నిధుల్లో కోతలు విధించారన్నారు. వ్యవసాయానికి రైతులకు ఇచ్చే సబ్సిడీల్లో గతంతో పోలిస్తే రూ.50వేల కోట్ల కోత విధించారని తెలిపారు. పేదలకు ఇచ్చే ఆహార సబ్సిడీ నిధుల్లో రూ.రెండు లక్షల 20వేల కోట్ల తగ్గించేశారన్నారు. పేదలకు, సామాన్య ప్రజలకు ఉపయోగపడే అన్ని సంక్షేమ పథకాలపై కోతలు విధించారన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, ప్రత్యేక ప్యాకేజీ నిధులు, పోలవరం ప్రాజెక్టు, విశాఖ రైల్వేజోన్ ఊసే లేదన్నారు. రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్, డి.కళ్యాణి, బి.వాసుదేవరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గొంతు దిగని 'గోరుముద్ద'..!

మెనూలో మార్పుతో ఇబ్బందులు

ఉమ్మడి జిల్లాలో సుమారు 12 వేల మంది విద్యార్థులు తినేందుకు విముఖత

తరచూ అస్వస్థతకు గురవుతున్న విద్యార్థులు

కొన్ని పాఠశాలల్లో సొంతమెనూ అమలు



ప్రజాశక్తి - భీమవరం

జగనన్న గోరుముద్ద విద్యార్థులకు గొంతు దిగడం లేదు. ప్రయివేటు సంస్థలు అందించే మధుర అన్నం పరిస్థితి కూడా ఇదేవిధంగా ఉంది. దీంతో పాఠశాలల్లో భోజనం తినేందుకు చాలామంది విద్యార్థులు ఆసక్తి చూపడం లేదు. ఉమ్మడి జిల్లాలో సరాసరి రోజుకు 10వేల నుంచి 12 వేల మంది విద్యార్థులు భోజనం తినడం లేదు. దీన్నిబట్టి ఆ భోజనం పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. జగనన్న గోరుముద్ద మెనూ మార్పు వల్ల మధ్యాహ్న భోజనం తిన్న విద్యార్థులు తరచూ అస్వస్థతకు గురవుతున్నట్లు తెలుస్తుంది. ఈ నేపథ్యంలో కొన్ని పాఠశాల్లోని తల్లిదండ్రుల కమిటీలు, ఉపాధ్యాయుల ఒప్పందం మేరకు సొంత మెనూను అమలు చేస్తున్నారు.

వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత విద్యార్థుల మధ్యాన భోజనం పథకంలో అనేక మార్పులు చేసింది. విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో జగనన్న గోరుముద్ద పథకాన్ని ప్రవేశపెట్టి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తుంది. ఈ పథకంలో అనేకసార్లు మెనూలో మార్పులు చేర్పులు చేశారు. ప్రస్తుతం సోమవారం ఉడికించిన గుడ్డుతో వేడి పొంగలి, పలావ్‌తో ఎగ్ కర్రీ, చిక్కీ ఇస్తున్నారు. మంగళవారం దొండకాయ చెట్నీతో చింతపండు పులిహోర, ఉడికించిన గుడ్డు, బుధవారం వెజిటబుల్ రైస్, బంగాళదుంప కుర్మా, ఉడికించిన గుడ్డు, చిక్కీ, గురువారం సాంబారు బాత్ లేక టమోటా చెట్నీతో నిమ్మకాయ రైస్, ఉడికించిన గుడ్డు, శుక్రవారం అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు లేక చిక్కీ, శనివారం ఆకుకూరతో అన్నం, పాలకూర, కరివేపాకు, కొత్తిమీర, పుదీనా వంటి ఆకుకూరలతో పెడుతున్నారు. అయితే ఈ మెనూ కొంతమంది విద్యార్థులకు నచ్చక భోజనం తినేందుకు ఆసక్తి చూపడం లేదు. దీనిపై అనేకసార్లు ఫిర్యాదులు వెల్లువెత్తడంతో గతేడాది నవంబర్‌లో కొన్ని మార్పులు చేశారు. గతంలో ప్రతీ గురువారం వండి పెట్టే కిచిడీని విద్యార్థులు తినేవారు. దీనిస్థానంలో సాంబారు అన్నం పెట్టాలని మెనూలో మార్పులు చేశారు. గతంలో శనివారం తెల్ల అన్నం, సాంబారు వడ్డించేవారు. ప్రస్తుతం అది కాస్తా ఆకు కూరలతో అన్నంగా మార్చారు. అయినా కొన్ని సందర్భాల్లో విద్యార్థులు భోజనం తినేందుకు సంకోచిస్తున్నారు.

తరచూ విద్యార్థులకు అస్వస్థత

మధ్యాహ్న భోజనం మెనూ మార్పుతో విద్యార్థులు తరచూ అస్వస్థతకు గురవుతున్నారు. ఈ మెనూ విద్యార్థులకు పడటం లేదని, కొన్ని పాఠశాలల్లో గతంలో జరిగిన ఘటనలు నిదర్శనగా చెప్పొచ్చు. మండల కేంద్రమైన పాలకోడేరులో పుదీనా రైస్ తిన్న 20 మంది విద్యార్థులు తీవ్ర అస్వస్థకు గురయ్యారు. వీరందరినీ పాలుకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించారు. ఈ ఘటనపై భీమవరం డివిజన్ రెవెన్యూ అధికారి దాసి రాజు, జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్‌వి.రమణ విద్యార్థులను పరామర్శించి వివరాలు సేకరించారు. ఈ ఘటనతో అధికారులు, జిల్లావాసులు ఆందోళనకు గురయ్యారు. అలాగే ఏలూరు జిల్లా పంగిడి, యర్నగూడెం ప్రాంతాల్లో కూడా మధ్యాహ్న భోజనం వికటించి విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవడంతో ఉమ్మడి జిల్లాలో కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల కమిటీ, ఉపాధ్యాయుల ఒప్పందం మేరకు సొంత మెనూ అమలు చేస్తున్నారు.

12 వేల మంది విద్యార్థులు గోరుముద్ద తినేందుకు విముఖత

రోజువారి గోరుముద్ద మెను ఒకటి, రెండు రోజులు రుచికరంగా ఉన్నప్పటికీ మిగతా రోజుల్లో సరిగా లేకపోవడంతో ఉమ్మడి జిల్లాలో సుమారు 10 వేల నుంచి 12 వేల మంది విద్యార్థులు తినేందుకు విముఖత వ్యక్తం చేస్తున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో 1382 ప్రాథమిక పాఠశాలలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో మధ్యాహ్నం భోజనం అమలవుతోంది. ఈ పాఠశాలల్లో సుమారు లక్షా 15 వేల మంది విద్యార్థులున్నారు. దీనిలో రోజుకు సరాసరి 90 వేల మంది విద్యార్థుల నుంచి 98 వేల మంది వరకూ భోజనం చేస్తున్నారని అధికారులు లెక్కలు చెబుతున్నారు. ఏలూరు జిల్లాలో సుమారు మారు 1300 నుంచి 1500లోపు పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనం అమలవుతుంది. భోజనం చేస్తున్న విద్యార్థుల సంఖ్య అయితే వాస్తవపరిస్థితులు విరుద్ధంగా ఉన్నట్లు తెలుస్తుంది. అధికారుల లెక్కలకు అనుగుణంగా విద్యార్థులు భోజనాలు చేయడం లేదని స్పష్టం అవుతోంది. 10 నుంచి 12 వేల మంది భోజనం చేసేందుకు విముఖత చూపుతున్నప్పటికీ అధికార యంత్రాంగం కనీస చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నాణ్యతలేని 'మధుర అన్నం'

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రయివేటు సంస్థలు మధుర అన్నం పేరిట మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నాయి. అయితే ఈ మధుర అన్నం ఆశించిన మేర మధురంగా ఉండటం లేదని అటు విద్యార్థులు ఇటు ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకులు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 70 ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మధుర అన్నం పంపిణీ చేస్తున్నారు. ఏలూరు జిల్లాలో అనేక పాఠశాలల్లో ఈ మధుర అన్నం పంపిణీ జరుగుతుంది. అయితే అన్ని పాఠశాలలకు కలిపి ఒకే చోట భోజనాన్ని తయారుచేసి పంపిణీ చేస్తారు. విద్యార్థుల సంఖ్యను బట్టి తెల్లవారుజామునే భోజనాన్ని తయారు చేస్తున్న నేపథ్యంలో పాఠశాలకు భోజనం వచ్చేసరికి పాడైపోతున్న పరిస్థితి అనేక సందర్భాల్లో తలెత్తింది. ఈ భోజనం కూడా రుచికరంగా ఉండట్లేదని, తినేందుకు విద్యార్థులు విముఖత చూపుతున్నారని జిల్లా సమీక్షా సమావేశంలో కలెక్టర్ సాక్షిగా జిల్లా మంత్రులు సమస్యను ఏకరువుపెట్టారు. ఈ నేపథ్యంలో జిల్లా అధికారులు నామమాత్రపు చర్యలు చేపట్టి చేతులు దులుపుకున్నారు. అయితే అప్పటి నుంచి సమస్య తరచూ ఉత్పన్నమవుతూనే ఉంది.

పటిష్టంగా అమలు చేస్తున్నాం

ఆర్‌వి.రమణ, జిల్లా విద్యాశాఖ అధికారి పశ్చిమగోదావరి

మధ్యాహ్న భోజనం నిర్వహణలో కొన్ని లోటుపాట్లు ఉన్నప్పటికీ జిల్లాలో పటిష్టంగా పథకాన్ని అమలు చేస్తున్నాం. జగనన్న గోరుముద్ద మెనూ ఎంతో పౌష్టికాహారంతో కూడుకుది. ఇది తినడం ద్వారా విద్యార్థులు ఆరోగ్యంగా ఉండడంతో పాటు పుష్టిగా ఉంటారు. కొంతమంది విద్యార్థులకు ఒకటి రెండు పరిస్థితుల్లో తినేందుకు విముఖత చూపడం వాస్తవమే. కానీ ఇలాంటి పరిస్థితుల్లో మెనూలో మార్పు చేసి విద్యార్థులకు వడ్డించడం జరుగుతుంది. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా జిల్లాలో గోరుముద్ద పథకాన్ని అమలు చేస్తున్నాము.



సిద్దార్థ మెడికల్ కాలేజీ వద్ద పోలీసుల నిర్బంధంలో కాళ్ల యుటిఎఫ్ నేతలు

యుటిఎఫ్ నేతల అరెస్టు సరికాదు

ప్రజాశక్తి - కాళ్ల

విజయవాడలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన సంకల్ప దీక్షలో నేతలను అరెస్టు చేయడం సరికాదని యుటిఎఫ్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బిఆర్‌ఎంకె.స్వామి, ఎం.శంకర్రావు అన్నారు. శుక్రవారం సంకల్ప దీక్షకు మండలం నుంచి 15 మంది వెళ్లగా, వారిని అరెస్టు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికే విఘాతం కలిగిస్తుందని ఆవేదన చేశారు. పాదయాత్రలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ ప్రకారం సిపిఎస్‌ను రద్దు చేయాలని కోరడం, దానికోసం పోరాటం చేయడం నేరమా అని వారు ప్రశ్నించారు. ఎంఎల్‌సిలు, రాష్ట్ర జిల్లా నాయకులు 36 గంటల దీక్ష చేపట్టాల్సిన పరిస్థితి రావడం శోచనీయమన్నారు. వెంటనే ముఖ్యమంత్రి సిపిఎస్‌ను రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి సిహెచ్.పట్టాభిరామయ్య, జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణంరాజు, సీనియర్ నాయకులు కె. సత్యనారాయణ, పి.ఎస్ విష్ణుప్రసాద్ పాల్గొన్నారు.

ఆర్‌టిసి కార్మికులపై వేధింపులు ఆపాలి

ప్రజాశక్తి - తణుకు రూరల్



ఆందోళన చేస్తున్న నాయకులు

కార్మికులను భయపెట్టడం, వేధింపులు ఆపాలని ఎస్‌డబ్ల్యుఎఫ్ జిల్లా అధ్యక్షులు టివిఎస్.మూర్తి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక తణుకు బస్ డిపో వద్ద ఎస్‌డబ్ల్యుఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేస్తే కార్మికుల బతుకులు బాగుంటాయని అనుకున్నారని కానీ కార్మికుల సమస్యలు, వారిపై వేధింపులు అధికారుల నుండి అధికమయ్యాయన్నారు. 2017 నుండి కార్మికులకు పే స్కేల్‌లోని బకాయిలను చెల్లించలేదన్నారు. పండుగ సెలవుల్లో పనిచేసిన వాటికి 2021-22 ఎన్‌క్యాష్‌మెంట్ ఇవ్వలేదని తెలిపారు. ఎనిమిది గంటల డ్యూటీకి వీలుగా పనిని మార్చాలని కోరారు. 2019 సర్క్యులర్‌ను అమలు చేయాలని, కార్మికులు అడుగుతుంటే అధికారులు అక్రమంగా సస్పెండ్ చేస్తూ కార్మికులను మానసికంగా వేధిస్తున్నారన్నారు. కార్మికుల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిపో కార్యదర్శి ఎన్.శ్రీనివాస్, యూనియన్ నాయకులు ప్రసాద్, పివి.నారాయణ, ఎఎన్‌వి.దుర్గారావు, ఎమ్‌డి సూర్యనారాయణ, కామన మునిస్వామి పాల్గొన్నారు.

జగనన్న విదేశీ విద్యా దీవెన పేద విద్యార్థులకు వరం

పది మందికి రూ.52 లక్షలు అందజేత - జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం


జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం పేద విద్యార్థులకు వరమని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. కలెక్టరేట్‌లో విదేశీ విద్యా దీవెనకు సంబంధించి మాన్యువల్ చెక్కును విద్యార్థులకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ జగనన్న విదేశీ విద్యా దీవెన పథకానికి జిల్లా నుంచి ఎనిమిది మందిని ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ ఏడాది తొలివిడతగా రూ.52,36,600 లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ అగ్రవర్ణాలకు చెందిన పేద విద్యార్థులు ప్రపంచంలోనే ఉన్నతమైన యూనివర్సిటీలో ఉన్నత విద్యావకాశాలు అభ్యసించేందుకు అవసరమైన ఆర్థిక సాయం జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం ద్వారా అందజేయడం జర్గుఉతోందన్నారు. టాప్ 200 విదేశీ యూనివర్సిటీలో అడ్మిషన్ పొందిన విద్యార్థులకు మొదటి విడత సాయాన్ని విడుదల చేసినట్లు తెలిపారు. ఏ విధమైన కోటాలు లేకుండా అర్హులైన విద్యార్థులందరికీ జగనన్న విదేశీ విద్యా దీవెన ఏడాది రెండు సీజన్లలో విదేశీ విద్యాలయాల్లో అడ్మిషన్లు, సంబంధిత శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీల నేతృత్వంలో రాష్ట్రస్థాయి ఎంపిక కమిటీ ద్వారా పూర్తి పారదర్శకంగా విద్యార్థులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలోని ముగ్గురు ఎస్‌సి విద్యార్థులకు రూ.9,00,600, ఇద్దరు బిసి విద్యార్థులకు రూ.2,50,000, ఒక ఇబిసి విద్యార్థికి, ఒక కాపు విద్యార్థికి కలిపి రూ.13,25,000, ఒక మైనార్టీ విద్యార్థికి రూ.27,61,000 వారి ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి జివిఆర్‌కెఎస్ఎస్ గణపతిరావు, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కె.శోభారాణి, జిల్లా ఎస్‌టి సంక్షేమ అధికారి డి.పుష్పరాణి, లబ్ధిదారులు పాల్గొన్నారు.



విద్యార్థులకు మాన్యువల్ చెక్కును అంజేస్తున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

జిల్లాతో కళాతపస్వి విశ్వనాథ్‌కు ప్రత్యేక అనుబంధం

ప్రజాశక్తి - పాలకొల్లు



కళాతపస్వి కె.విశ్వనాథ్‌కు జిల్లాకు మరచిపోలేని సంబంధాలున్నాయి. పాలకొల్లు, నరసాపురం పట్టణాల్లో ఆయనకు ఘన సత్కారాలు జరిగాయి. ఆయనను సత్కరించిన ప్రముఖులు, జిల్లా వాసులు ఆయన మృతితో దిగ్భ్రాంతికి గురయ్యారు. పాలకొల్లులో సుప్రసిద్ధ దర్శకులు కోడి రామకృష్ణ స్థాపించిన లలిత కళాంజలి నాటకోత్సవంలో ఆయనకు ఘన సత్కారం జరిగింది. 1989 మే 28వ తేదీన ఆయనను జస్టిస్ ఇయ్యపు పాండురంగారావు సారథ్యంలో ఘనంగా సత్కరించారు. బర్కిలీ, లలిత కళాంజలి అవార్డుల బహుమతి ప్రదానోత్సవంలో నాటిమంత్రి చేగొండి హరిరామజోగయ్యతో పాటు ప్రముఖులు పాల్గొన్నారు. పాలకొల్లుకు చెందిన బివి.రాధారమణ గుప్త, కొటికలపూడి కృష్ణారావు, వంగా నరసింహారావు, మానాపురం సత్యనారాయణ, కెవి.కృష్ణవర్మ, మేడికొండ శ్రీనివాస్, కె.రామ్‌ప్రసాద్, నాటి సన్మానంలో పాలుపంచుకున్న ఘటనలు ప్రస్తుతం గుర్తుకు తెచ్చుకున్నారు.

నరసాపురంలో : 2018 డిసెంబర్ 15న బాపూ జయంతి సందర్భంగా నరసాపురంలో రాష్ట్ర ప్రభుత్వం విశ్వనాథ్‌ను ఘనంగా సన్మానించింది. అప్పటి మంత్రి పితాని సత్యనారాయణ, ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు, మున్సిపల్ ఛైర్మన్ సారథ్యంలో ఘనంగా సత్కరించారు. నరసాపురంలో బాపు విగ్రహావిష్కరణకు తాను రాలేకపోయానని సన్మాన కార్యక్రమం సందర్భంగా బాపు విగ్రహాన్ని చూసి విశ్వనాథ్ ఆవేదన చెందారు. గోదావరితీరంలో తనకున్న అనుబంధాన్ని ఆయన వివరించారు. నాటి సన్మాన కార్యక్రమంలో కొత్తపల్లి సుబ్బారాయుడు, రెడ్డప్ప ధవేజి, డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ, డాక్టర్ డి.వెంకటేశ్వరరావు పాల్గొని విశ్వనాథంతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. తన సినిమాలు ఎక్కువగా గోదావరి తీరంలో తీశానని.. గోదావరి ప్రకృతి రమణీయ దృశ్యాల్లో రమణీయ సంగీత, నృత్య గీతాలను విశ్వనాథ్ ప్రేక్షకులతో పాలుపంచుకున్న ఘటనలు గోదావరి ప్రాంత ప్రజలు నేడు నెమరు వేసుకుంటున్నారు.

సిపిఎం సంతాపం

భీమవరం : కళాతపస్వి కె.విశ్వనాథ్ మృతికి సిపిఎం జిల్లా కమిటీ సంతాపం తెలిపింది. ఈ మేరకు శుక్రవారం పార్టీ జిల్లా కార్యదర్శి బి.బలరాం ఒక ప్రకటన విడుదల చేశారు. చిన్న ఆర్టిస్టుగా సినీజీవితం ప్రారంభించిన విశ్వనాథ్ దర్శకుడిగా సామాజిక సంస్కరణల ఆవశ్యకతపై అనేక మంచి చిత్రాలు అందించారని పేర్కొన్నారు. ఆయన చిత్రాల్లో తెలుగు సంస్కృతి ప్రతిబింబిస్తుందన్నారు. ఆయన మరణం సినీ రంగానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. విశ్వనాథ్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామని పేర్కొన్నారు.

భీమవరం రూరల్:ప్రముఖ దర్శకులు కె.విశ్వనాథ్ మృతికి అఖిల భారత శోభన్ బాబు సేవాసమితి నాయకులు భట్టిప్రోలు శ్రీనివాసరావు సంతాపం వ్యక్తం చేశారు. తమ అభిమాన నటుడు శోభన్‌బాబుతో అనేక ఉత్తమ చిత్రాలను తీసిన దిగ్గజ దర్శకులు ఇక లేరంటే తాము దిగ్భ్రాంతి చెందామని ఆయన విచారం వ్యక్తం చేశారు. కాలం మారింది, చెల్లెలి కాపురం, శారద, జీవన జ్యోతి, ప్రేమ బంధం, జీవిత నౌక, చిన్ననాటి స్నేహితులు, ప్రయివేటు మాస్టర్ వంటి ఉత్తమ అవార్డ్ చిత్రాలను అందించిన గొప్ప దర్శకుడు విశ్వనాథ్, శోభన్‌బాబుతో ఆయన తీసిన చిత్రాలకు వరుసగా నాలుగు నంది అవార్డులు గెలుచుకోవడం తమకెంతో గర్వకారణమన్నారు.

రీ సర్వేను వేగవంతం చేయండి : జెసి

ప్రజాశక్తి - ఆకివీడు

రీ సర్వే వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ జెవి మురళి అధికారులకు సూచించారు. మండలంలోని ఐ భీమవరంలో జరుగుతున్న రీ సర్వే గ్రౌండ్ కంట్రోల్ పాయింట్లను జెసి శుక్రవారం సాయంత్రం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రీ సర్వే టీములు భూముల వద్దకు వచ్చినప్పుడు రైతులు వారి సరిహద్దులు చూపించి సర్వే టీములకు సహకరించాలన్నారు. సర్వేకు అవసరమైన అన్ని రకాల పనిముట్లు ఇప్పటికే అందించామన్నారు. సర్వే బృందం, అధికారుల విజ్ఞప్తి మేరకు ఆకివీడులో సర్వేకు అవసరమైన 25 మంది విఆర్‌ఒలను, మరో 25 మంది సర్వే సిబ్బందిని నరసాపురం డివిజన్ నుంచి అత్యవసర ప్రాతిపదికపై డిప్యూటేషన్ మీద పంపించాలని డిఆర్‌ఒను ఆదేశించారు. 68 గ్రామాల్లో అత్యంత వేగవంతంగా సర్వే నిర్వహించాలని తెలిపారు. అనంతరం చినకాపురం, పెదకాపురం, కోళ్లపర్రు గ్రామాల్లోని సచివాలయాలను ఆయన తనిఖీ చేశారు. ఈ నెలలో ప్రభుత్వం అమలు చేసే పథకాల లబ్ధిదారుల జాబితాలను సోషల్ ఆడిట్ చేశారా లేదా అని పరిశీలించాలన్నారు. అర్హుల జాబితాను సచివాలయాల వద్ద ప్రదర్శించాలన్నారు. సచివాలయంలో ఏ ఫిర్యాదు వచ్చినా సంబంధిత అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని జెసి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ దాసి రాజు, తహశీల్దార్ వెంకటేశ్వర రావు, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు కెఎఎస్ఎస్ శ్రీనివాసరావు, ఎంపిడిఒ శ్రీకర్, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఐభీమవరంలో రీ సర్వే పనులను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ మురళీ

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని 6న ధర్నా

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టరేట్ వద్ద ఈనెల 6వ తేదీన ధర్నా నిర్వహించనున్నట్లు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి కె.ఝాన్సీ, డి. కళ్యాణి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యూటీ ఇవ్వాలని, ఫేస్ యాప్‌ను రద్దు చేయాలని, వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ పథకం పెండింగ్ బిల్లులు విడుదల చేసి, పెంచాలని ధర్నా నిర్వహించనున్నామని తెలిపారు. అంగన్వాడీల ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యమని విమర్శించారు. కనీస వేతనాలు, సంక్షేమ సౌకర్యాలు అమలు చేస్తామని వాగ్దానాలు చేయడమే తప్ప అమలు నామ మాత్రమే తెలిపారు. కొత్త పథకాలు, కొత్త యాప్‌లు తీసుకొచ్చి అంగన్వాడీలపై పని భారాన్ని విపరీతంగా పెంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కారం గాక, ఒత్తిళ్లు భరించలేక అంగన్వాడీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.



మాట్లాడుతున్న డిసిసిబి ఛైర్మన్ నరసింహరాజు

సమన్వయంతో పని చేయాలి

డిసిసిబి ఛైర్మన్ నరసింహరాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

నూతనంగా ఎన్నికైన సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వాలంటీర్లు వైసిపి కుటుంబ సభ్యులంతా సమన్వయంతో పనిచేయాలని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. శృంగవృక్షం ఆర్యవైశ్య కళ్యాణ మండపం, పాలకోడేరు రైస్‌మిల్లు సమీపన ఖాళీ స్థలంలో శృంగవృక్షం, పెన్నాడ, గొరగనమూడి, విస్సాకోడేరు, పాలకోడేరు, మోగల్లు, కోరుకొల్లు, గొల్లలకోడేరు, గరగపర్రు, కుముదవల్లి, కొండేపూడి, వేంద్ర అగ్రహారం గ్రామాలకు చెందిన నూతనంగా ఎన్నికైన కన్వీనర్లు, గృహ సారథుల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహరాజు మాట్లాడుతూ ఎన్నికలు దగ్గర పడుతున్నాయని, ఈ నేపథ్యంలో అంతా కలిసికట్టుగా పనిచేయాలని అన్నారు. నియోజకవర్గంలో వైసిపి జెండా ఎగరవేసే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణరాజు (చంటిరాజు), సర్పంచి అంబర్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు భూపతిరాజు వంశీకృష్ణంరాజు, బోల్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేటి నుంచి హేలాపురి బాలోత్సవం

ఏలూరు సిఆర్‌ఆర్ పబ్లిక్ స్కూల్లో భారీ ఏర్పాట్లు

ప్రజాశక్తి - ఏలూరు

హేలాపురి బాలోత్సవాల, మూడవ పిల్లల సంబరాలు ఏలూరు సర్ సిఆర్ రెడ్డి పబ్లిక్ స్కూల్ ఆవరణలో ఈ నెల నాలుగు, ఐదు తేదీల్లో అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని గౌరవ అధ్యక్షులు, ఎంఎల్‌సి షేక్ సాబ్జీ తెలిపారు. రెండు రోజులపాటు 21 అకాడమిక్ అంశాలు, ఎనిమిది సాంస్కృతిక అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నామని, ఈ పోటీలకు 175 విద్యాలయాలయాల నుండి సుమారు ఏడు వేల మంది విద్యార్థులు పాల్గొంటున్నారని తెలిపారు. 500 మంది నిర్వాహకులుగా, కోఆర్డినేటర్లుగా, న్యాయ నిర్ణేతలుగా సహకారం అందించనున్నారని తెలిపారు. చిన్నారుల్లో మానసిక ఆనందం కలిగించడం, వారిలో దాగిఉన్న నైపుణ్యాలను వెలికితీయడం, వారిలో పోటీతత్వం పెంచడమే ఈ కార్యక్రమ ముఖ్యఉద్దేశమని ఆహ్వాన సంఘం అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఎల్.వెంకటేశ్వరరావు, కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, కోశాధికారి కృష్ణారావు అన్నారు. అకాడమిక్, సాంస్కృతిక పోటీలు ముస్తఫా ఆలీ, నాట్యాచార్య లయన్ హేమసుందర్ నిర్వహణలో జరుగుతాయన్నారు. భోజన ఏర్పాట్లు, నిర్వహణ బాధ్యతలు జె.సత్యనారాయణరాజు, బొల్లా సత్యనారాయణ, మేతర అజయ్‌బాబు, కట్టా సత్యనారాయణ, హరినారాయణ, కూచిపూడి సత్యనారాయణ, అడుసుమిల్లి నిర్మల సహకారం అందించనున్నారన్నారు.



ఉత్సవాలకు సిద్ధమైన పాఠశాల ప్రాంగణం

కుష్టు వ్యాధిగ్రస్తులకు పరీక్షలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

కుష్టు వ్యాధి గ్రస్తులను ఆదరించినప్పుడే మహాత్మాగాంధీకి నిజమైన నివాళి అని ఆర్‌డిఒ దాసి రాజు తెలిపారు. శ్రీవిజ్ఞాన వేదిక, సెయింట్ మేరీస్, లెప్రసీ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ కుష్టు నివారణా పక్షోత్సవాల్లో భాగంగా గునుపూడిలోని కుష్టు వ్యాధి కాలనీలో శుక్రవారం రోగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వారికి పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాసి రాజు మాట్లాడుతూ 4 దశాబ్దాలుగా భీమవరం లెప్రసీ కాలనీలో సెయింట్ మేరీస్, లెప్రసీ సెంటర్ విశేష సేవలందిస్తున్నాయని తెలిపారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఆకివీడు ఎంవిఎస్ రాజు సహకారంతో పండ్లు, రొట్టెలు అందించామన్నారు. కార్యక్రమంలో సిస్టర్ ఎల్విరా, ఎఒ ఆకుల పెద్ది రాజు, లయన్స్ క్లబ్ అధ్యక్షులు నందమూరి రాజేష్, దళిత ఐక్య వేదిక అధ్యక్షులు గంటా సుందర కుమార్, కాలనీ అధ్యక్షులు వీర్రాజు పాల్గొన్నారు.



రోగులకు పండ్లు అందజేస్తున్న ఆర్‌డిఒ దాసిరాజు



గొర్రెలు, మేకలకు టీకాలు

ప్రజాశక్తి - ఉండి

పిపిఆర్ వ్యాధి నివారణ టీకాల వల్ల మేకలు, గొర్రెల్లో వచ్చే పారుడు వ్యాధిని అరికట్టొచ్చని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు జి.మల్లేశ్వరరావు అన్నారు. శుక్రవారం చినపుల్లేరులో పిపిఆర్ వ్యాధి నివారణా టీకాల కార్యక్రమాన్ని డాక్టర్ జి.మల్లేశ్వరరావు, గ్రామ సర్పంచి పెన్మెత్స సావిత్రమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పారామిక్సోవిరిడే జాతికి చెందిన మార్జిల్లి వైరస్ వల్ల పిపిఆర్ వ్యాధి వస్తుందన్నారు. అనంతరం గొర్రెలకు, మేకలకు టీకాలు వేశారు. మండల పశువైద్యాధికారి ప్రియాంక రాబర్ట్ మాట్లాడుతూ ఈనెలాఖరు వరకూ మండలంలోని ప్రతి గ్రామంలోనూ పిపిఆర్ వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. గొర్రెలు, మేకలు పెంపకందారులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎహెచ్ఎ చంటి, పశువుల పెంపకందారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎఒ రాజేష్

వరికి జింకులోపంపై అవగాహన

ప్రజాశక్తి - అత్తిలి

వరికి కాంప్లెక్స్ ఎరువుల్లో ఫాస్ఫరస్ (భాస్వరం) ఎక్కువగా వాడితే జింకులోపం అధికంగా వచ్చే అవకాశం ఉందని ఎఒ రాజేష్ అన్నారు. శుక్రవారం ఈడూరులో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ వరిలో జింకులోపం కనిపించినట్లయితే లీటర్ నీటికి రెండు గ్రాముల బిలేటెడ్ కలిపి వారం పది రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాల్సి ఉంటుందన్నారు. రైతులు పురుగు, తెగుళ్ల ఉధృతి కనిపించినప్పుడు మాత్రమే రసాయనాలు వాడాలని తెలిపారు. ప్రస్తుతం రైతులు 1121 ఎక్కువగా సాగు చేయడం జరిగిందన్నారు. దీనికే బ్యాక్టీరియా ఆకు లక్షణాలు ఎక్కువగా ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



ప్రభుత్వ ఆసుపత్రికి జ్వరాలతో వచ్చిన విద్యార్థులు

మారిన వాతావరణం

జలుబు, జ్వరాల బారిన విద్యార్థులు, పిల్లలు

ప్రజాశక్తి - పాలకొల్లు

వాతావరణ మార్పులతో పిల్లలు జలుబు, జ్వరాలతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో పట్టణంలోని ఆసుపత్రులు పక్షం రోజులుగా నిండి ఉంటున్నాయి. ముఖ్యంగా పిల్లల ఆసుపత్రులు కిక్కిరిసి ఉంటున్నాయి. శుక్రవారం పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి స్థానిక గురుకులంకు చెందిన 30 మంది విద్యార్థులు ఇవే లక్షణాలతో వచ్చారు. చెన్ను విజయ్ సారధ్యంలో పిల్లల వైద్యులు సంతోష్ కుమార్ వారికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో పిల్లలు జ్వరం, రొంపలతో బాధపడుతున్నారని ఆయన మీడియాకు చెప్పారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఎంఎల్ఎ సాయం

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

అరట్లకట్ట గ్రామంలోని పెద్దరావుపేటలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో పాకేరెళ్ల అర్జునరావు ఇల్లు దగ్ధమైంది. విషయం తెలుసుకున్న శాసనసభ్యులు నిమ్మల రామానాయుడు ధర్మారావు ఫౌండేషన్ తరపున ఆ కుటుంబానికి కావాల్సిన నిత్యావసర సరుకులు, వస్తువులు ఫౌండేషన్ సభ్యులు పోతల శ్రీను ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి శ్రీనివాసరావు, చింతపల్లి సత్యనారాయణ, మారంపూడి పెద్దబ్బులు, ఇళ్ల అంజి పాల్గొన్నారు.

8 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

ప్రజాశక్తి - మొగల్తూరు

కాశీపట్నం పడమరలో పేకాట స్థావరంపై శుక్రవారం దాడి చేశామని ఎఎస్ఐ యు.రాజేంద్ర తెలిపారు. ఈ దాడిలో 8 మందిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.5,960 నగదును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

సచివాలయ వ్యవస్థ ద్వారా సంక్షేమ పాలన

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

దళారీ వ్యవస్థకు అవకాశం లేకుండా గ్రామాల్లో సచివాలయ వ్యవస్థ ద్వారా పారదర్శకంగా ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమ పథకాలు అందిస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. శుక్రవారం నీలాద్రిపురం గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను ఆయన ప్రారంభించారు. స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలను ఆవిష్కరించారు. అనంతరం సర్పంచి రాజమహేంద్రవరపు లక్ష్మణరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అమలు చేయడంలో ప్రభుత్వం చిత్త శుద్ధితో పనిచేస్తోందన్నారు. మళ్లీ మోసపూరిత హామీలతో టిడిపి ప్రచారం కొనసాగిస్తోందన్నారు. ఓటు రూపంలో ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు అసత్య ఆరోపణలు చేస్తున్నాయని అన్నారు. పవన్ కళ్యాణ్ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని హితావు పలికారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి ముత్యాల ఆంజనేయులు, వైస్ ఎంపిపి రామకృష్ణ, ఎడిఎపి మురళీకృష్ణ, తహశీల్దార్ అప్పారావు, ఎంపిడిఒ వెంకటేష్, పంచాయతీరాజ్ డిఇ వేణుగోపాల్, సర్పంచులు పాల్గొన్నారు.



సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను ఉపముఖ్యమంత్రి

తమిళనాడు చెరకుకు డిమాండ్

జిల్లాలో తగ్గిన సాగు

ప్రజాశక్తి - పాలకొల్లు

ప్రస్తుతం తమిళనాడు చెరకుకు డిమాండ్ పెరిగింది. గతంలో గోదావరి జిల్లాలో చెరకు విస్తారంగా పండేది. అయితే చెరకు రైతులు చవిచూడడంతో వాటిసాగుపై అంతగా ఆసక్తి చూపడం లేదు. దీంతో పాలకొల్లు నియోజకవర్గంలో చెరకు సాగు విస్తీర్ణం తగ్గింది. ప్రస్తుతం తమిళనాడు నుంచి చెరకు గోదావరి జిల్లాలకు దిగుమతి అవుతోంది. గోదావరి జిల్లాల్లో పండే చెరకు నాణ్యత లేకపోవడం తమిళనాడు చెరకు తీపిగా ఉండటంతో చెరకు గెడలను కొందరు వ్యాపారులు తమిళనాడు నుంచి తీసుకొచ్చి చిల్లర వ్యాపారులకు అమ్ముతున్నారు. దీంతో పలు పట్టణాల్లో వీటిని ఎక్కువగా విక్రయిస్తున్నారు. దీంతో వీటికి గిరాకీ పెరిగింది. గతంలో అంతర్వేది వంటి తిరుణాళ్లలో చెరకు గెడలు అమ్మేవారు. అయితే పలు పట్టణాల్లో ప్రస్తుతం చెరకు రసం అమ్ముతున్నారు. పాలకొల్లు కొబ్బరి నీళ్ల వల్లే లీటరు 80 రూపాయలకు అమ్ముతున్నారు.



తమిళనాడు నుంచి దిగుమతి అయిన చెరకు

స్వయం సహాయ సంఘాలకు రుణాలివ్వాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

స్వయం సహాయక సంఘం సభ్యులకు లక్ష్యం మేరకు శ్రీనిధి రుణాలను అందించాలని సంస్థ ఎజిఎం పి.శశికుమార్ కుమార్ సిబ్బందికి సూచించారు. మొగల్తూరులోని వైఎస్ఆర్ క్రాంతి పథం కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలానికి రూ.8.07 కోట్లు, ఉమ్మడి జిల్లాకు రూ.339.82 కోట్ల రుణాలు అందించడమే లక్ష్యమని తెలిపారు. ఇప్పటివరకు 45,338 మందికి రూ.184.57 కోట్లు రుణాలు అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం ఎం.సుభాషిని పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎజిఎం శశికుమార్

వాహనదారులు హెల్మెట్ ధరించాలి


ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని రూరల్ ఎస్ఐ కె.శ్రీనివాస్ తెలిపారు. లంకలకోడేరు గ్రామంలో హెల్మెట్ లేకుండా తిరుగుతున్న వాహనదారులకు ఎస్ఐ శుక్రవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. హెల్మెట్ పెట్టుకోవడం వల్ల ప్రాణనష్టం తగ్గుతుందని, వీలైతే వెనక ఉన్నవారు కూడా హెల్మెట్ ధరించాలని తెలిపారు.

దాళ్వాలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - తణుకురూరల్

దాళ్వాలో కాండం తొలుచు పురుగు ఉధృతి ఎక్కువగా ఉందని, సరైన సస్యరక్షణ చేపట్టి నివారించుకోవాలని తూర్పుగోదావరి జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ ప్రధాన శాస్త్రవేత్త చల్లా వెంకట నరసింహారావు రైతులకు సూచించారు. శుక్రవారం జిల్లాలో తణుకు, నిడదవోలు, ఉండ్రాజవరం మండలాల్లో పలు గ్రామాల్లో వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకట నరసింహారావు మాట్లాడుతూ జిల్లాలోని వరి పంటకు కాండం తొలిచు పురుగు ఆశించిందని, నివారణకు చర్యలు చేపట్టాలని అన్నారు. జిల్లాలో చాలా చోట్ల రబీ నాట్లు ఆలస్యంగా చేపట్టడం, సార్వా, దాళ్వా పంటల వ్యవధి తక్కువగా ఉండటం వల్ల పాత సీజన్ లోని వరి మోళ్ల సక్రమంగా కలవలేదన్నారు. దీని వల్ల భాస్వరం, ఎరువులు కొంత మంది వేయకపోవడం వల్ల పాత దుబ్బులు కలవక, ప్రస్తుత సీజన్ లో ఎరువులను పంట సరిగా తీసుకోకపోవడం వలన, మొక్క బలహీనపడి కాండం తొలిచే పురుగుకు లొంగిందన్నారు. దీని నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రాములు, కార్టోప్ హైడ్రోక్లోరైడ్ 20 గ్రాములు, 0.3 మిల్లీ లీటర్లు నీటితో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఈ పురుగు దాళ్వా సీజన్‌లో ప్రస్తుతం తొలి దశలో ఉందని ఉపేక్షిస్తే పంట ప్రత్యుత్పత్తి దశలో తదుపరి తరం ఆశించి తెల్లకంకి నష్టం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ రమేష్, ఎఒ ఎం.విశ్వాసరావు, ఎఇఒ కె.గణేష్, విఎఎలు గంగాధర్, గీతా మణి, రాము రైతులు పాల్గొన్నారు.



వరిచేలను పరిశీలిస్తున్న తూర్పుగోదావరి జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ వెంకట నరసింహారావు

ఫ్యామిలీ ఫిజీషియన్‌ను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

రోగులను ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమానికి తరలించే విషయంలో ఆశా కార్యకర్తలు ప్రముఖ పాత్ర పోషించాలని డిప్యూటీ డిఎంఅండ్ హెచ్ఒ డాక్టర్ వాకపల్లి ప్రసాద్ అన్నారు. శుక్రవారం ఆలమూరు పిహెచ్‌సి పరిధిలో ఆలమూరు-1 హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌లో వైద్యులు కొడాలి ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని సందర్శించి రికార్డులు తనిఖీ చేసి డాక్టర్ కొడాలి ప్రదీప్‌కుమార్‌ను, సిబ్బందిని ప్రశంసించారు. సాధ్యమైనంత వరకూ ఎక్కువ మంది రోగులను చూసి పరీక్షించి మందులు ఇవ్వాలని సూచించారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ఇంకా అద్భుతంగా నిర్వహించడానికి తగిన సలహాలు సూచనలు చేశారు. అనంతరం ఆలమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి గర్భిణులకు ప్రొటీన్ పౌడర్లు అందజేశారు.




రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఒ వాకపల్లి ప్రసాద్

గొరగనమూడి ఉపసర్పంచిగా రామాంజనేయులు

అభినందించిన సర్పంచి శివాజీ రాజు, పాలకవర్గ సభ్యులు

ప్రజాశక్తి - పాలకోడేరు

గొరగనమూడి ఉపసర్పంచిగా గూడూరి వెంకట రామాంజనేయులు నూతనంగా ఎన్నికయ్యారు. గత పంచాయతీ ఎన్నికల్లో ఈ ఉపసర్పంచి పదవిని ముగ్గురికి పంపకం చేయడం జరిగింది. ఇప్పటివరకూ దొంగ సురేష్ ఉప సర్పంచిగా పనిచేసి పదవికి రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో నూతన ఉప సర్పంచిగా రామాంజనేయులను శుక్రవారం ఎన్నుకున్నారు. ఈ ఎన్నికకు ఉండి ఇఒపిఆర్‌డి కొండలరావు వ్యవహరించారు. సర్పంచి గొట్టుముక్కల వెంకట శివరామరాజు (శివాజీరాజు), పాలకవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఉపసర్పంచిగా రామాంజనేయులును ఎన్నుకున్నారు. అనంతరం ఎన్నికల అధికారి కొండలరావు ఉపసర్పంచి నియామక పత్రాన్ని రామాంజనేయులకు అందజేశారు. పాలకోడేరు ఇఒపిఆర్‌డి రెడ్డియ, పంచాయతీ కార్యదర్శి పోలయ్య పరిశీలకులుగా వ్యవహరించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన ఉప సర్పంచిను పాలకవర్గ సభ్యులు రుద్రరాజు జానకిరామరాజు, పితాని నవీన్, కిషోర్, దొంగ సురేష్, విమల, తమ్మిశెట్టి లీలావతి, సన్నిధి ధనలక్ష్మి, తులసి రాజమణి, పెనుమల నాగలక్ష్మి, సచివాలయ ఉద్యోగులు అభినందించారు.



ఎన్నికైన ఉప సర్పంచి రామాంజనేయులును అభినందిస్తున్న సర్పంచి శివాజీ రాజు, పాలకవర్గ సభ్యులు

హాస్టళ్లలో విద్యార్థుల చేరికపై శ్రద్ధ వహించాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థుల చేరికపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖల అధికారుల పరిధిలోని వసతి గృహాలపై అధికారులతో సమీక్షించి మాట్లాడారు. ప్రతి హాస్టల్లో నిబంధనల ప్రకారం వంద మంది వసతి పొందాల్సి ఉండగా చాలా తక్కువ మంది వసతి పొందడం, కొన్ని వసతి గృహాల్లో అసలు చేరికలు లేకపోవడం ఎందుకు జరుగుతోందని అధికారులను ఆరా తీశారు. హాస్టల్ వెల్ఫేర్ అధికారులందరూ వసతి గృహాల్లో చేరికలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మత్స్యకార గ్రామాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహించి, వసతి గహాల్లో ఖాళీల సమాచారాన్ని విస్తతంగా ప్రచారం చేయాలన్నారు. జిల్లాలో 38 సాంఘిక సంక్షేమ వసతి గృహాలు, 29 బిసి వెల్ఫేర్ వసతి గృహాలు, రెండు ఎస్‌టి వెల్ఫేర్ వసతి గృహాలు ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి జివిఆర్‌కెఎస్-ఎస్.గణపతిరావు, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కె.శోభారాణి, డి.పుష్పరాణి, వికలాంగుల సంక్షేమ శాఖ ఎడి ప్రధాన్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై కఠిన చర్యలు తీసుకోవాలి

బాల్య వివాహాలపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో బాల్య వివాహాలపై ఆడిట్‌ను ఐసిడిఎస్ అధికారులతో నిర్వహించారు. జిల్లాలో జరిగిన ఎనిమిది బాల్య వివాహాలపై జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఆడిట్ నిర్వహించారు. బాల్య వివాహాలు మీకు తెలియకుండానే జరుగుతున్నాయా అని అధికారులను ప్రశ్నించారు. నిబంధనలకు విరుద్ధంగా బాల్య వివాహాలు జరిపితే ఫోక్స్ యాక్ట్ కింద కేసు నమోదు చేయడం జరుగుతుందని తెలియజేయాలన్నారు. సమావేశంలో ఐసిడిఎస్ పిడి బి.సుజాతరాణి, సిడిపిఒలు, సచివాలయ, అంగన్వాడీలు పాల్గొన్నారు.